

ఆదివారం విజయవాడ రోటరీ ఆడిటోరియంలో "బాపూ రమణీయం" పుస్తకాన్ని ప్రముఖ నిర్మాత శ్రీ డూండీ ఆవిష్కరిస్తున్నప్పటి చిత్రం. పక్కన శ్రీ తుర్లపాటి కుటుంబరావు, శ్రీ బాపూ, శ్రీ ముళ్లపూడి వెంకటరమణలు.

# బాపూ రమణీయం ఆవిష్కరణ

విజయవాడ, ఏప్రిల్ 22 [నవ వార్త] : ప్రచారం అంటే గిట్టని మహావ్యక్తులు బాపూ, రమణలని వారి స్నేహం విడదీయరానిదని, తెలుగు వారికి ఆదర్శమని ఆంధ్రజ్యోతి పత్రికా సంపాదకులు శ్రీ నండూరి రామమోహనరావు అన్నారు.

ఆదివారం సాయంత్రం రోటరీ ఆడిటోరియంలో జరిగిన బాపూ రమణీయం పుస్తకావిష్కరణ సభకు ఆయన అధ్యక్షత వహించారు.

బాపూ చిత్రాలు, ముళ్ళపూడి వెంకటరమణ రచనల గురించి తెలియని తెలుగువాడు లేడని ఆయన అన్నారు. శ్రీ రమణ ఆంధ్రపత్రికలో చిత్రసమీక్షలు రాయడంలో కొత్త వరవడి సృష్టించి నేటికీ ఆదర్శంగా నిలిచారని శ్రీ నండూరి అన్నారు. బాపు గీసిన గీత తెలుగు రేఖా చిత్ర జగత్తులో అనన్య ప్రతిభను సాధించిందని ఆయన కొనియాడారు.

పుస్తకాన్ని ప్రముఖ చిత్ర నిర్మాత శ్రీ డూండీ ఆవిష్కరించి, తొలి ప్రతిని జ్యోతిచిత్ర సంపాదకులు శ్రీ తుర్లపాటి కుటుంబరావుకు సమర్పించారు. శ్రీ తుర్లపాటి ప్రసంగిస్తూ 'బాపూ రమణీయం'ను 'బాపురే రమణీయం' అని అనాలని అన్నారు. ఎందుకంటే ఇద్దరు తెలుగువాళ్లు కలిసి వుండడం కష్టమైన రోజుల్లో 40 ఏళ్లుగా విడదీయరాని స్నేహంగా వుంటూ తెలుగువారికి ఆదర్శమైత్రిని పంచిపెట్టారని అన్నారు.

శ్రీ బాపు, శ్రీ ముళ్లపూడి వెంకటరమణలకు నవోదయ పబ్లికేషన్స్ అధినేత శాలువలు కప్పి సత్కరించారు. ముందుగా వేదికమీద ఆసీనులైన శ్రీ డూండీ, శ్రీ నండూరి, శ్రీ తుర్లపాటిలకు కూడా శాలువలు కప్పి సత్కరించారు.

శ్రీ ఇంద్రగంటి శ్రీకాంతశర్మ, శ్రీ శ్రీరమణలు కూడా ప్రసంగించారు.

పుస్తకాన్ని ప్రచురణ చేసిన నవోదయ పబ్లికేషన్స్ అధినేత శ్రీ రామమోహన్‌రావు స్వాగతం పలికారు.